సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారానికి 54.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 353 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61.330
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5.478
3 శాతం జీఎస్టీతో	రూ.5,642
నవర (8 గ్రా)	రూ.45,136

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.7 /27.0

సోమవారం గాలిలో 66 శాతం తేమ ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు పెరగొచ్చు. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.



ఇఫ్తార్ మంగళవారం (సా) 6.22
సహర్ బుధవారం (ఉ) 4.48

రంజాన్ వేళలు

ప్రజలకు మరింత చేరువగా..

అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది. దీంతో ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. సేవలు మరింత చేరువయ్యాయి. సంక్షేమ పథకాల అమలు, వాటి పర్యవేక్షణ సులభతరమైంది. అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి చెందుతోంది. పునర్విభజన జరిగి నేటికి సంవత్సర కాలం పూర్తయింది.

- జిల్లాల విభజన జరిగి ఏడాది పూర్తి
- సులువుగా ప్రభుత్వ సేవలు
- పారిశ్రామికంగా ప్రగతి పరవళ్లు
- తీర ప్రాంతంలో అపార అవకాశాలు
- పరిష్కారమవుతున్న సమస్యలు



మండలాలు : 38
రెవెన్యూ డివిజన్‌లు : 4
నియోజకవర్గాలు : 08
పంచాయతీలు : 722
జనాభా : 32 లక్షలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంగా ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టింది. గతేడాది ఏప్రిల్ 4వ తేదీన విభజన జరిగింది. గతంలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు, నాయుడుపేట, గూడూరు రెవెన్యూ డివిజన్లతో 46 మండలాలు ఉండేవి. విభజన అనంతరం కావలి, కందుకూరు, నెల్లూరు, ఆత్మకూరు నాలుగు రెవెన్యూ డివిజన్లతో 38 మండలాలు జిల్లాలో ఉన్నాయి. నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో 12 మండలాలు, కావలిలో 10, ఆత్మకూరులో 9, కందుకూరులో 7 మండలాలున్నాయి. జిల్లాల విభజన అనంతరం పరిపాలనా వికేంద్రీకరణ వల్ల ప్రజలకు మేలు జరుగుతోంది. గతంలో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి నోచుకుంటున్నాయి. జిల్లా అధికారులు మండలాల అధికారులతో నిత్యం టెలీకాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ప్రజలకు విస్తృతమైన సేవలు అందిస్తున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. గడిచిన నాలుగు నెలల్లో సుమారు 14 వేలకు పైగా ఇళ్లు నిర్మించారు. ఈనెల చివరి వారంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన చేతుల మీదుగా గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టనున్నారు.

ఉపాధి అవకాశాలు

డీఆర్‌డీఏ, ఉపాధి కల్పన శాఖల ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. తాజా లెక్కల ప్రకారం జిల్లాలో ఏడాది కాలంలో సుమారు 22 వేల మందికి వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించారు.

పారిశ్రామిక ప్రగతి

నెల్లూరు జిల్లాలో కందుకూరు నియోజకవర్గం విలీనమైంది. కావలికి దగ్గరలో ఉన్న రామాయపట్నంలో పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.3,743 కోట్లతో పోర్టు పనులు ప్రారంభించారు. తొలిదశలో నాలుగు బెర్తులు పూర్తిగా అందుబాటులోకి వస్తాయి. అదానీ కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా ఇప్పటికే అనేక పరిశ్రమలను ఏర్పాటు చేశారు. త్వరలో కొడవలూరు మండలం చంద్రశేఖరపురం వద్ద మిథానీ అల్యూమినియం పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు. త్వరలో కావలి-నెల్లూరు మధ్యలో మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆత్మకూరు సమీపంలో ఇండస్ట్రియల్ పార్కుకు భూములు కేటాయించి పనులు చేస్తున్నారు. నేలటూరులో దామోదరం సంజీవయ్య 1,600 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి అనుబంధంగా రెండో దశలో నిర్మించిన మూడో యూనిట్ (800 మెగావాట్లు)ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. భారతదేశంలోనే ప్రప్రథమంగా ఏపీ జెన్‌కో ద్వారా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ ఇక్కడే ఉంది. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద 11,095 ఎకరాల్లో రూ.5,783.84 కోట్లతో క్రిస్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్ తదితర పరిశ్రమలు అందుబాటులోకి రానున్నాయి.


కలెక్టర్ కార్యాలయం

పెరిగిన భూముల ధరలు

జిల్లాల పునర్విభజనతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. నెల్లూరు, కావలి, కోవూరు తదితర ప్రాంతాల్లో ధరలు పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం అధికమైంది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్లు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. భవన నిర్మాణాలు అధికమయ్యాయి. కార్మికులకు పనులు పుష్కలంగా లభిస్తున్నాయి.

వేగవంతంగా సేవలు



జిల్లాల పునర్విభజన ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగవంతంగా అందుతున్నాయి. సంక్షేమ పథకాల అమలును నిత్యం పర్యవేక్షిస్తున్నాం. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం.

– కూర్మనాథ్, జేసీ

ప్రజలకు మేలు



జిల్లాల పునర్విభజనతో పరిపాలన వికేంద్రీకరణ జరిగి ప్రజలకు మేలు జరిగింది. ఇది సంతోషకరమైన విషయం. ఉద్యోగుల అంతర్‌జిల్లాల బదిలీలను ప్రభుత్వం చేపట్టాలి.

– వై.రమణారెడ్డి, ఏపీ జీఈఏ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

నిర్ణీత గడువులోగా పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ, డీఆర్వో


నెల్లూరు(అర్బన్): స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జేసీ కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జేసీ, డీఆర్వో వెంకటనారాయణమ్మ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ మళ్లీ రాకుండా సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఎంఐపీ, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, శ్రీనివాసులు, వెంకటదాసు, డీటీసీ చందర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో విరివిగా టీబీ పరీక్షలు


మాట్లాడుతున్న వెంకటప్రసాద్

నెల్లూరు(అర్బన్): పీహెచ్‌సీల్లో టీబీ పరీక్షలను విరివిగా చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఆదేశించారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మలేరియా విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య సహాయకులతో సమీక్ష సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో పరీక్షలు అందుబాటులో లేకపోతే సమీపంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు (సీహెచ్‌సీ)కి పంపాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ అన్ని పీహెచ్‌సీలకు మలేరియా, డెంగీ కిట్లు పంపామన్నారు. మైక్రోస్కోప్‌లను సైతం రిపేర్ చేయించామన్నారు. ఎక్కువ పరీక్షలు చేస్తూ సకాలంలో వ్యాధి నిర్ధారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం


బుచ్చిరెడ్డిపాలెం: నాగమాంబపురంలో నగదు అందజేస్తున్న వలంటీర్

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ సోమవారం ప్రారంభమైంది. బ్యాంక్‌లకు సెలవులు రావడంతో ఈ ప్రక్రియ ఆలస్యంగా మొదలైందని అధికారులు తెలిపారు. మొదటిరోజు 44,230 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నుంచి సుకుమార్‌రెడ్డి సస్పెన్షన్

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గానికి చెందిన మన్నెమాల సుకుమార్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేసింది.



సీఎంను కలిసిన ప్రజాప్రతినిధులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

– నెల్లూరు

పది పరీక్షలకు 27,395 మంది హాజరు


నెల్లూరు: పరీక్ష హాల్లో విద్యార్థులు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 172 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఎగ్జామ్స్ ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు కావడంతో పెద్దఎత్తున తల్లిదండ్రులు సెంటర్ల వద్దకు విచ్చేశారు. హాల్‌టికెట్ నంబర్లు చూసుకోవడంలో, గదులు వెతుక్కోవడంలో తమ పిల్లలకు సాయం చేశారు. ధైర్యం చెప్పి బాగా రాయాలని సూచించారు. కొందరు పరీక్ష ముగిసే వరకు అక్కడే చెట్ల కింద సేదతీరారు. కాగా 27,708 మందికి గానూ 27,395 మంది హాజరయ్యారు. 313 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 98.87గా నమోదైంది. విద్యార్థులను పరీక్ష సమయానికి గంట ముందు కేంద్రంలోకి అనుమతించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. డీఈఓ గంగాభవాని నెల్లూరులోని ఎస్‌కేడీ బాలికలు, ఎస్‌సీసీసీఓ, ఈఎస్సార్ మున్సిపల్ హైస్కూల్స్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, కోవూరులోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, వశిష్ట, సెయింట్ పాల్స్ హైస్కూల్స్‌ను, పరిశీలకులు 11 కేంద్రాలను పరిశీలించారు.


నెల్లూరు: తండ్రి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థి

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 254 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలకు తొలిరోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా 255 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. పది ఎగ్జామ్స్‌కు 1,159 మందికి గానూ 1,076 మంది హాజరయ్యారు. 83 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి 2,921 మందికి గానూ 2,750 మంది హాజరయ్యారు. 171 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని సెయింట్‌జోన్స్ హైస్కూల్లో పది పరీక్షలు, సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణ తీరును డీఈఓ గంగా భవాని పరిశీలించారు.

బోధన.. పరిశోధన.. విస్తరణ

- మత్స్య కళాశాలకు 30 ఏళ్లు
- రాష్ట్రంలోని ఏకైక కళాశాల
- 31వ బ్యాచ్‌కి తరగతులు
- అనేక అంశాల్లో శిక్షణ


ముత్తుకూరులోని కళాశాల

ముత్తుకూరు/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆక్వా రంగంలో బోధన, పరిశోధన, విస్తరణ అనే మూడు సూత్రాలతో ముత్తుకూరులో మత్స్య శాస్త్ర కళాశాల ఏర్పడింది. రాష్ట్రంలోని ఏకైక కళాశాలగా 30 ఏళ్లు పూర్తి చేసుకుని 31వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. నీలి విప్లవాన్ని దృష్టిలో పెట్టుకుని 1991 ఆగస్ట్ 31వ తేదీన నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి ఈ కాలేజీకి శంకుస్థాపన చేశారు. 1992 డిసెంబర్‌లో బీఎఫ్ఎస్సీ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిషరీ సైన్స్) నాలుగు సంవత్సరాల కోర్సు 20 సీట్లతో ప్రారంభమైంది. 1995 మార్చి 10వ తేదీన ఈ కళాశాలకు నూతన భవనం ఏర్పడింది.

పీహెచ్‌డీ స్థాయికి..

దేశంలో మొత్తం 28 మత్స్య కళాశాలున్నాయి. ముత్తుకూరులోని మత్స్య కళాశాల తొలుత తిరుపతిలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉండగా, తర్వాత శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోకి వచ్చింది. తొలుత బీఎఫ్ఎస్సీ కోర్సులతో మొదలై క్రమంగా ఎంఎఫ్ఎస్సీ, పీహెచ్‌డీ స్థాయికి ఎదిగింది.

శాస్త్రవేత్తలుగా..

అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు మత్స్య శాస్త్రాన్ని బోధిస్తూ విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. బోధనతో సరిపెట్టకుండా పరిశోధనలు చేయిస్తూ, సముద్ర ఉత్పత్తులపై సంపూర్ణ అవగాహన కలిగిస్తున్నారు. ఈ కళాశాలకు వెంకటాచలం మండలంలోని తిరుమలమ్మపాళెంలో 73 ఎకరాలు, ఎగువమిట్టలో 47 ఎకరాల భూములున్నాయి. ఎగువమిట్ట భూముల్లో చేపల పెంపకం జరుగుతోంది. విద్యార్థులు ఇక్కడ తరచూ శిక్షణ పొందుతున్నారు. విశాలమైన క్రీడా మైదానం, అనేక దేశ, విదేశీ పుస్తకాలతో లైబ్రరీ, ల్యాబ్, సమావేశ మందిరం, హాస్టళ్లు తదితర సౌకర్యాలతో ఈ కళాశాల యూనివర్సిటీ స్థాయిని సంతరించుకుంది.

ప్రస్తుతం		
కోర్సు	విద్యార్థుల సంఖ్య	సబ్జెక్టులు
బీఎఫ్ఎస్సీ	154	8
ఎంఎఫ్ఎస్సీ	12	6
పీహెచ్‌డీ	7	3

క్షేత్ర సందర్శన

తరగతి గదుల్లో మత్స్య శాస్త్రాన్ని అభ్యసించడమే కాకుండా ఆక్వా సాగు, రైతుల కష్ట, నష్టాలు స్వయంగా తెలుసుకునే నిమిత్తం బీఎఫ్ఎస్సీ నాలుగో సంవత్సరం చదివే విద్యార్థులు 'ఫివెప్' (ఫిషరీస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం) అనే కార్యక్రమంలో పాల్గొంటారు. 110 రోజులపాటు గ్రామాల్లో నివాసం ఉంటూ రొయ్యలు, చేపల పెంపకం, చెరువుల యాజమాన్యం, మేత వినియోగం, అనారోగ్య సమస్యలు, నివారణ పద్ధతులు, పట్టుబడి తదితర అంశాలపై అవగాహన పెంచుకుంటారు. దీనిపై ఒక నివేదిక రూపొందిస్తారు. అలాగే, 'ఈఎల్‌పీ' (ఎక్స్‌పీరియన్స్ లెర్నింగ్ ప్రోగ్రాం) అనే కార్యక్రమంలో పాల్గొంటారు. 12 వారాల ఈ కార్యక్రమంలో ఫైనలియర్ విద్యార్థులు రంగు చేపల పెంపకం చేసి, అమ్మకాలు చేస్తారు. చేపలు, రొయ్యల ఊరగాయలు, వడియాలు తయారు చేసి, అమ్మకాలు చేస్తారు. భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుంది.


విద్యార్థులు తయారు చేసిన రొయ్యల పచ్చడి


ఆరోగ్యవంతమైన రొయ్య సీడ్

ఇద్దరు భూటాన్ విద్యార్థులు

27వ బ్యాచ్ కింద భూటాన్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు షెరింగ్ జాంగ్మో, షెరింగ్ డోర్జి బీఎఫ్ఎస్సీలో చేరారు. వీరిద్దరి చదువులకయ్యే ఖర్చును భూటాన్ ప్రభుత్వమే భరిస్తుంది. చదువు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు కూడా ఇస్తుంది. ప్రస్తుతం వీరు ఫైనలియర్ చదువుతున్నారు.



మెండుగా ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు బోధనతోపాటు, శిక్షణ, క్షేత్ర సందర్శన చాలా ముఖ్యం. మత్స్య కళాశాలలో చదువు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక్కడి కళాశాలలో చదివిన విద్యార్థులు చాలామంది దేశ, విదేశాల్లో కూడా ఉద్యోగాలు చేస్తున్నారు.

– డాక్టర్ రామలింగయ్య, అసోసియేట్ డీన్

ప్రతిపాదన ఉంది



మన రాష్ట్రంలో మరో రెండు మత్స్య కళాశాలలు అవసరం. తమిళనాడులో నాలుగు, మహారాష్ట్రలో మూడు మత్స్య కళాశాలలున్నాయి. ఈ కోణంలో మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, నరసాపురంలో రెండు మత్స్య కళాశాలలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది.

– డాక్టర్ డి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఫిషరీస్ డీన్

ఎడగారు లాభదాయకం

ఎడగారులో కొత్త రకాల వరి వంగడాలను సాగు చేసిన రైతులు లాభాలు పొందుతున్నారు. జిల్లాలోని వాతావరణ పరిస్థితులు నూతన వరి వంగడాలైన కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 733 రకాల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ రకం వరి పంటలకు చీడపీడలు కూడా తక్కువగా ఆశిస్తున్నాయి. దిగుబడులు కూడా బాగుండడంతో రైతులు ఈ రకాలను సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నారు.

- కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 733 విత్తనాలకు మార్కెట్‌లో గిరాకీ
- తెగుళ్ల వ్యాప్తి తక్కువ
- ఆశాజనకంగా దిగుబడులు

నూతన వరి వంగడాల సాగుపై రైతుల ఆసక్తి



విడవలూరులో కోత దశలో ఉన్న కేఎన్‌ఎం 733 రకం వరి పంట(ఫైల్)

కొడవలూరు: ఎడగారు సాగు జిల్లాలో ప్రత్యేకం. ఏప్రిల్‌లో ఆరంభమై సెప్టెంబర్‌తో ముగుస్తుంది. ఈ సమయంలో ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల ప్రత్యేకమైన రకాలను సాగు చేస్తే రైతన్నకు అనుకూలంగా ఉంటుంది. ఎడగారులో కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 733 రకాల వరి విత్తనాలు సాగుకు అనుకూలమని రైతులు చెబుతున్నారు. ఈ రకాలను తెలంగాణ రాష్ట్రంలోని కూనారం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేశారు. ఈ రకాలు 2019లో జిల్లాకు మినీ కిట్ల రూపంలో రాగా, ప్రస్తుతం ఎడగారులో ప్రధాన రకాలుగా సాగవుతున్నాయి. ఈ రకాల వరి వంగడాలు రాక ముందు వరకు ఎన్‌ఎల్‌ఆర్ 34449, ఎంటీయూ 1010 రకాలను ఎడగారులో రైతులు విరివిగా సాగు చేసేవారు. ఎంటీయూ 1010 రకాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఆ రకాన్ని పూర్తిగా వదిలేసి కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 733 రకాల వరి వంగడాల సాగుపై అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఈ రెండు రకాల విత్తనాలకు ఎడగారులో డిమాండ్ పెరిగింది.

దిగుబడి ఆశాజనకమే

రబీ పంట కాలంతో పోలిస్తే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎడగారులో దిగుబడులు తగ్గడం మామూలే. పై రెండు రకాల వరి విత్తనాలు రబీలో అధిక దిగుబడులు ఇస్తూ ఎడగారులో సైతం ఆశాజనకంగా దిగుబడులు ఇస్తున్నాయి. కేఎన్‌ఎం 1638 రకం రబీలో నాలుగున్నర పుట్లకు తగ్గకుండా దిగుబడి ఇస్తుండగా, ఎడగారులో మూడున్నర పుట్ల దాకా దిగుబడి వస్తోంది. కేఎన్‌ఎం 733 రకమైతే రబీలో 5 పుట్లకు తగ్గకుండా దిగుబడినిస్తూ ఎడగారులో కేఎన్‌ఎం 1638 లాగే మూడున్నర పుట్ల దిగుబడినిస్తోంది. ఈ రెండు రకాల వరి విత్తనాలు లాభదాయక లక్షణాలను కలిగి ఉన్నాయి.

కనిపించని తెగుళ్ల లక్షణాలు

కేఎన్‌ఎం 1638 రకమైతే అకాల వర్షం అధికంగా వచ్చినా తట్టుకొని యథావిధిగా దిగుబడి వస్తుందని నిరూపించింది. ఇది రుచికరంగానూ, అన్నం సాగే గుణం కలిగి ఉంది. పైరు పడిపోదు. ఉల్లి కోడు, సుడి దోమ, కాండం తొలిచే పురుగులను సమర్థవంతంగా తట్టుకోవడంతోపాటు అగ్గితెగులు, మెడ విరుపు, పాము పొడ, వేరు కుళ్లు తెగుళ్ల లక్షణాలు కన్పించవు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు పెద్దగా వినియోగించాల్సిన అవసరం ఉండదు. అందువల్ల బీపీటీ 5204(పెద్ద జిలకర)తో సమాన ధరకు మార్కెట్‌లో ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

మార్కెట్‌లో మంచి ధర

కేఎన్‌ఎం 733 రకం విషయానికొస్తే దీనికి చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి. ముదురు నారు నాటినా పిలకలు బాగా వేసే సామర్థ్యం ఉంటుంది. ఎండాకాలంలో ఈ రకం బాగా సన్నగా ఉండి షుగర్ లెస్‌ను పోలి ఉంటుంది. అందువల్ల ఈ రకం ధాన్యాన్ని మార్కెట్‌లో మంచి ధరకు కొనుగోలు చేస్తారు. ఇందులో పిలకలన్నీ ఒక్కసారిగా వెన్ను తీయడం వల్ల రైతు లాభపడే అవకాశం మెండుగా ఉంటుంది. అందువల్లే దీనిని 'మినిమం గ్యారంటీ' రకంగా రైతులు పేర్కొంటున్నారు. గత ఎడగారులో ఈ రకాల వరి వంగడాలను సాగు చేసిన రైతులు మంచి ఫలితాలు సాధించారు. అందువల్లే ఈ రకాల సాగుపై ఈ ఎడగారులోనూ కర్షకులు ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది..

ఎడగారులో అధికారిక ఆయకట్టు - 4.25 లక్షల ఎకరాలు

కేఎన్‌ఎం 1638 రకం	కేఎన్‌ఎం 733 రకం
సాగు విస్తీర్ణం 40 శాతం	సాగు విస్తీర్ణం 30 శాతం

లాభదాయకం



2020 సంవత్సరం నుంచి కూనారం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త(వరి) డాక్టర్ శ్రీధర్ సిద్ది సూచనలతో కేఎన్‌ఎం 1638 రకాన్ని పొలంలో సాగు చేస్తున్నాను. ఇప్పటివరకు రబీ, ఎడగారుల్లో కలిపి 6 సార్లు చేశాను. రబీలో నాలుగున్నర పుట్లు, ఎడగారులో మూడున్నర పుట్లు దిగుబడి సాధించాను. సాగు వ్యయం కూడా గణనీయంగా తగ్గింది.

– దేగా మురళీమోహన్‌రావు, రైతు, గుండాలమ్మపాళెం, కొడవలూరు మండలం

ఎడగారుకు ఉత్తమం



కేఎన్‌ఎం 733 రకం 2019లోనే వచ్చినప్పటికీ 2021 నుంచి రబీ, ఎడగారుల్లో సాగు చేస్తున్నాను. షుగర్‌లెస్, వరికి ప్రత్యామ్నాయంగా ఈ రకం కొనుగోలు చేస్తున్నారు. గత ఎడగారులో ఈ రకాన్ని పుట్టి(846 కిలోలు) రూ.18,500లకు కొనుగోలు చేశారు. ఈ రకం సాగు చేసి లాభపడడంతోనే ఎడగారులోనూ సాగు చేస్తున్నాను.

– దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, రైతు, విడవలూరు

రైతుల అనుభవాలే ప్రామాణికం



కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 733 రకాలు నెల్లూరు జిల్లాలోని వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి చేయకపోయినప్పటికీ ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఈ రకాల వరి వంగడాలకు బాగా అనుకూలిస్తున్నాయని సాగు చేసిన రైతులు చెబుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతోపాటు మార్కెట్‌లో మంచి ధరకు విక్రయించుకొంటున్నట్లు రైతులు అనుభవపూర్వకంగా తెలియజేస్తున్నారు.

– డాక్టర్ సీహెచ్ దామోదర్‌రాజు, ప్రధాన శాస్త్రవేత్త(వరి), వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానం

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం



అర్జీదారు నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విజయారావు

- ఎస్పీ సీహెచ్ విజయారావు

నెల్లూరు సిటీ: ఫిర్యాదుదారులకు తగిన న్యాయం చేస్తామని ఎస్పీ సీహెచ్ విజయారావు హామీ ఇచ్చారు. నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 100 ఫిర్యాదులు అందాయి. బాధితుల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువు లోపు అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. సోషల్ మీడియాలో కొత్త స్నేహితుల పరిచయాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రేమ పేరుతో వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నారని, వారితో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భూవివాదాలతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వెంటనే స్పందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. హత్య కేసులను అన్ని కోణాల్లో దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు ఎస్పీ భోజన సదుపాయం కల్పించారు.

సెస్ వసూళ్లలో జిల్లా ముందంజ

- మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత

నెల్లూరు(సెంట్రల్): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సెస్ వసూళ్లలో జిల్లాలో అన్ని మార్కెటింగ్ కార్యాలయాలు లక్ష్యాన్ని పూర్తి చేశాయని ఏడీ అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం లక్ష్యం రూ.20.30 కోట్లు విధించగా, రూ.34.42 కోట్లకు పైగా సెస్ వసూలు చేసినట్లు తెలిపారు. టార్గెట్ కన్నా ఎక్కువ వసూలు చేసినట్లు తెలిపారు.

నేడు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు

- పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- డీఆర్వో వెంకటనారాయణమ్మ



పరీక్షల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మంగళవారం ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల పరీక్షలు ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పేపర్–1కు 360 మంది, పేపర్–2కు 360 మంది హాజరవుతారని తెలిపారు. కావలిలోని విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, కోవూరు మండలం గంగవరం ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు ముత్తుకూరు రోడ్డులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగులకు స్క్రైబ్‌లను సహాయకులుగా అనుమతిస్తామని, స్క్రైబ్‌లు కనీసం ఇంటర్మీడియట్, పదో తరగతి చదివి ఉండాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కావలిరూరల్: పట్టణంలోని చికెన్ దుకాణాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చికెన్ దుకాణాల్లోని మాంసం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని చికెన్ దుకాణాలను తనిఖీలు చేశామని, ప్రజలకు నాణ్యమైన మాంసం అందించేలా దుకాణాల యజమానులకు సూచించామని తెలిపారు. అలాగే ప్రతి దుకాణంలో శానిటేషన్ కొరవడిందని, దీనిపై యజమానులు దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా చికెన్ దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడాన్ని గుర్తించి రెండు దుకాణాలకు రూ.2 వేలు, ఒక దుకాణానికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా వ్యాపారాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగుమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

- కుమారులు పట్టించుకోలేదని ఆవేదన



రమణయ్య మృతదేహం

నెల్లూరు సిటీ: కన్న కొడుకులు తనని పట్టించుకోవట్లేదన్న ఆవేదనతో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు నగరంలోని జగదీష్‌నగర్ ఒకటో వీధిలో రావుల రమణయ్య(77) తన చిన్న కుమారుడు శ్రీనివాసులు వద్ద ఉంటున్నాడు. రమణయ్యకు నలుగురు కుమారులు కేశవులు, రఘురాం, రాములు, శ్రీనివాసులు ఉన్నారు. అందరికీ వివాహమైంది. రెండేళ్ల క్రితం రమణయ్య భార్య ఆదెమ్మ కరోనాతో మృతిచెందింది. భార్య మృతిచెందిన తరువాత రమణయ్య నలుగురు కుమారుల్లోని ఒక్కొక్కరి వద్ద కొన్ని రోజులపాటు ఉండేవాడు. భార్య చనిపోయిన బాధ ఒకవైపు, కొడుకులు, కోడళ్లు సరిగా చూడడం లేదని మరోవైపు మానసిక క్షోభకు గురయ్యాడు. గత నెల 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన రమణయ్య తిరిగిరాలేదు. శ్రీనివాసులు తన సోదరులకు, బంధుమిత్రులకు తండ్రి కనిపించడం లేదని తెలిపాడు. వారు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం సాయంత్రం రూరల్ మండలంలోని కొత్తూరులో రమణయ్య పురుగుమందు తాగి వాంతులు చేసుకున్నాడని శ్రీనివాసులు స్నేహితుడు సూరి ఫోన్‌లో అతనికి తెలిపాడు. చికిత్సనిమిత్తం వెంటనే రమణయ్యను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం ఉదయం ఆయన మృతిచెందాడు. శ్రీనివాసులు భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బలవర్థకమైన పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సౌజన్య

కోవూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బలవర్థకమైన పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ సౌజన్య సూచించారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రం–2లో సోమవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారం, చిరుధాన్యాల గురించి వివరించారు. అనంతరం వెల్ బేబీ షో నిర్వహించి ఒక సంవత్సరం వయస్సు కలిగి బరువు బాగున్న పిల్లలకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ జ్యోతి, ఏసీడీపీఓ అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 111
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కావలి, ఆత్మకూరు, నెల్లూరు పట్టణ ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు బీపీ, షుగర్, రక్తశాతం తదితర పరీక్షలను క్రమంగా తప్పకుండా చేయాలన్నారు. పౌష్టికాహారం తీసుకునేలా వారిని చైతన్యం చేయాలన్నారు. టీకాలు వేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత మాట్లాడుతూ ప్రసవ ప్రణాళిక ప్రకారం హాస్పిటల్స్‌లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్లు హరిశ్చంద్ర సతీష్, వెంకటరమణ, సునీల్, డీపీఓ రమేష్, డెమో అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

594 పొగాకు బేళ్ల విక్రయం



డీసీపల్లిలో అమ్ముడైన పొగాకు బేళ్లు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి సోమవారం వేలానికి 630 బేళ్లు తీసుకురాగా 594 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మిగిలిన 36 బేళ్లలో 7 నోసేల్, 26 నోబిడ్, 3 సీఆర్‌గా గుర్తించారు. 81,355 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.1,59,60,663ల వ్యాపారం జరిగింది. ఒక కిలో గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.183, సగటున రూ.196.18 ధర పలికింది. వేలంలో 8 కంపెనీలు పాల్గొన్నాయి.

మహిళ ఆత్మహత్యాయత్నం

పొదలకూరు: మండలంలోని చాటగొట్ల బీసీకాలనీకి చెందిన మహిళ సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎస్సై ఎస్‌కే కరిముల్లా వివరాల మేరకు గ్రామానికి చెందిన అనసూయమ్మ సోదరి అదే గ్రామానికి చెందిన ప్రభాకర్‌కు బాకీ చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభాకర్ తన భార్యతో కలిసి బాకీ విషయమై మాట్లాడేందుకు పిలిచాడు. తన సోదరితోపాటు అనసూయమ్మ కూడా వెళ్లింది. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి అనసూయమ్మపై ప్రభాకర్ చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందిన బాధితురాలు పురుగుమందు తాగింది. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. బాధితురాలు పొదలకూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతోంది.